క్లుప్తంగా

ఉగాదికి చౌడేశ్వరిదేవి ఆలయం ముస్తాబు



కల్లూరు: ఉగాది ఉత్సవాలకు కల్లూరులోని శ్రీచౌడేశ్వరిదేవి ఆలయం ముస్తాబైంది. ఆలయాన్ని రంగు రంగుల పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉత్సవాలకు కర్నూలు జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉగాది రోజున ఆలయం చుట్టూ బురదలో ఎద్దులు, గాడిదలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయడం ఇక్కడి విశేషం.

పని ప్రదేశంలో రక్షణ చర్యలు తప్పనిసరి



ఉపాధి సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ఎండ తీవ్రత దృష్ట్యా ఉపాధి హామీ పనులు చేసే ప్రదేశం వద్ద కూలీలకు రక్షణ చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. సోమవారం తన కార్యాలయంలో మండల ఉపాధిహామీ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఎండతీవ్రత అధికంగా ఉండడంతో కూలీలు పనిచేసే ప్రాంతాల్లో నీడ, తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధుల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలన్నారు. ఏపీఓ లక్ష్మన్న, టీఏలు రామ్‌శంకర్, మురళీ, సీఓ సుధాకర్, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఓటే ఆయుధం



ఓటుహక్కుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

సి.బెళగల్: మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఓటు ద్వారా రాజ్యాంగం మనకు కల్పించిందని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం ఎన్నికల సెక్టోరియల్ అధికారి, ఈఓఆర్డీ సందీప్, వీఆర్వోలు, బీఎల్వోలతో ఓటుహక్కు వినియోగంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ సాగింది. బస్టాండ్ వద్ద విద్యార్థులతో మానహారం ఏర్పాటు చేసి ఓటు వినియోగంపై నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, ఆ హక్కును వినియోగించుకుని ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టాలన్నారు.


ఆరోగ్యమే మహాభాగ్యం



లద్దగిరిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

కోడుమూరు రూరల్: ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యం లేకుంటే ఎంత డబ్బున్నా అనుభవించడానికి అవకాశముండదని లద్దగిరి పీహెచ్‌సీ వైద్యాధికారి భాస్కర్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని లద్దగిరి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు ర్యాలీ, మానవహారం నిర్వహించి ఆరోగ్యం ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, మానసికంగా, శారీరకంగా, ఆరోగ్యంగా ఉండాలన్నారు. ముఖ్యంగా ఉప్పు, నూనె, షుగర్ వంటి ఆహార పదార్థాలను మితంగా వాడాలని, పొగాకు, మద్యం వంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రతిరోజు వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, సీహెచ్‌ఓ శాంత, సూపర్‌వైజర్ శారద తదితరులు పాల్గొన్నారు.

20 మంది వలంటీర్ల రాజీనామా



రాజీనామా చేసిన వలంటీర్లు

కల్లూరు: మండలంలోని పెద్దటేకూరు, దొడ్డిపాడు గ్రామాలకు చెందిన 20 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. మండల పరిషత్ కార్యాలయంలో అధికారులకు రాజీనామా సమర్పించారు. ఈ సందర్భంగా వలంటీర్లు మాట్లాడుతూ.. ఎవరి ప్రోద్బలం, ప్రోత్సాహంతో రాజీనామా చేయడం లేదని..స్వచ్ఛందంగా చేస్తున్నట్లు తెలిపారు.

ఫ్యాన్‌కు ఓటేయండి

- వైఎస్సార్‌సీపీ పాలనలో చేకూరిన మేలును మరువొద్దు
- ప్రతిపక్షాలకు ఓటుతో బుద్ధి చెప్పండి
- ఎన్నికల ప్రచారంలో పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి రాంభూపాల్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనేత కాటసాని శివనరసింహారెడ్డి

కల్లూరు: ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆ పార్టీ పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి కోరారు. సోమవారం కల్లూరు అర్బన్ 37వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కాటసాని మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలని కోరారు. టీడీపీ గత పాలనకు.. ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య గల తేడాను గమనించాలన్నారు.ఈ 58 నెలలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలును ప్రతి కుటుంబం గుర్తు చేసుకోవాలన్నారు. సంక్షమాన్ని ఇంటి ముంగింటకే తెచ్చారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ఇలా పనిచేయలేదన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా స్థానికంగానే అన్ని రకాల సేవలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. త్వరలో సీఎం వైఎస్ జగన్ మేనిఫెస్టో విడుదల చేస్తారని, అందులో రెట్టింపు సంక్షేమం ఉంటుందన్నారు. 2014 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి 600కు పైగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ప్రజలను మోసం చేశాయని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూడా ఆ పార్టీలు మళ్లీ జతకట్టాయని, నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆయిషా సిద్ధిఖా, వివిధ వార్డుల కార్పొరేటర్లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

కల్లూరు అర్బన్ 30, 31వ వార్డులలోని శరీన్‌నగర్‌కు చెందిన దాదాపు 35 టీడీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం రాత్రి ఎమ్మెల్యే స్వగృహంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, యువనాయకుడు కాటసాని శివనరసింహారెడ్డి టీడీపీ శ్రేణులకు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. రాంబాబు, సాయన్న, హనుమంతు, మధు, సురేష్, బాలాజీ, వెంకటేష్, చిన్న, రఫీ, అయస్వామి, లక్ష్మన్ పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో బోయ శివ, వార్డులోని నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉంటాం



రోగిని పరామర్శిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గంలోని పేదలందరికీ అండగా ఉంటామని, అవసరమైన వారికి ఉచితంగా వైద్య సేవలు అందిస్తానని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం కోడుమూరు మండల పరిధిలోని కొండాపురం గ్రామానికి చెందిన మద్దిలేటి కుమార్తె అనారోగ్యంతో నగరంలోని అమిలీయో హాస్పిటల్‌లో చేరారు. విషయం తెలుసుకున్న వారు ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. అందిస్తున్న వైద్య సేవల గురించి అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో చాలా మందికి ఏ వ్యాధి వస్తే ఏ డాక్టర్ దగ్గరకు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాంటి వారందరి కోసం తాము ప్రత్యేకంగా ఓ బృందాన్ని ఏర్పాటు చేశామని, ఈ బృందం సభ్యులు దగ్గర ఉండి ఆసుపత్రుల్లో చేర్పించి చికిత్స అందిస్తున్నారన్నారు.

పీఎస్‌ల తీరుపై ఎంపీడీఓ ఆగ్రహం



పంచాయతీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: మండలంలోని పలువురు గ్రామ పంచాయతీ కార్యదర్శుల తీరుపై ఎంపీడీఓ, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలపై ఈఓఆర్డీ సందీప్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గోనే నాయక్, పంచాయతీ కార్యదర్శులతో సోమవారం సమీక్షించారు. అయితే సమావేశానికి పలువురు పంచాయతీ కార్యదర్శులు డుమ్మా కొట్టడంపై అసహనం వ్యక్తం చేశారు. ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా గైర్హాజరు కావడంపై మండిపడ్డారు. కొందరు పీఎస్‌లు నివేదికలు ఇవ్వడంలో అలసత్వం వహిస్తున్నారని, సమయపాలన పాటించడం లేదని.. వారిపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తెలిపారు. నిర్లక్ష్య వైఖరిని విడనాడి ప్రజలకు అందుబాటులో ఉండాలని హితవుపలికారు. వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వైభవంగా వల్లెలాంబదేవి తిరునాల



వల్లెలాంబదేవి ఉత్సవ విగ్రహన్ని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆలయ కమిటీ సభ్యులు



అమ్మవారికి గంగపూజ

- అమ్మవారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు
- నేడు శ్రీవల్లెలాంబదేవి రథోత్సవం

కోడుమూరు రూరల్: కోడుమూరులోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవి తిరునాల సోమవారం వైభవంగా ప్రారంభమైంది. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు గోపూజ, గణపతి పూజ, గంగపూజ కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. అంతకుముందు ఆలయ ధర్మకర్త పూలవాసు ఇంటి నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో ఆశీనులను చేసి మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చారు. రాత్రి అమ్మవారి ప్రభోత్సవం కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి, సభ్యులు రమేష్‌నాయుడు, సాలప్ప, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేటి రథోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఉగాది పర్వదినమైన మంగళవారం అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రఘునాథ్‌రెడ్డి తెలిపారు. రథోత్సవంలో ప్రజలంతా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- పోలింగ్ బూత్‌లలో మౌలిక సౌకర్యాలు కల్పించండి
- జేసీ, రిటర్నింగ్ అధికారిణి నారపురెడ్డి మౌర్య
- గడివేముల మండలంలోని సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల తనిఖీ



గడివేములలో అవగాహన కల్పిస్తున్న రిటర్నింగ్ అధికారిణి నారపురెడ్డి మౌర్య

గడివేముల: ఎన్నిల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కర్నూలు జాయింట్ కలెక్టర్, పాణ్యం నియోజకవర్గ ఎన్నికల అధికారిణి నారపురెడ్డి మౌర్య హెచ్చరించారు. సోమవారం గడివేముల ఎంపీడీఓ కార్యాలయంలో బీఎల్‌ఓలు, సెక్టోరియల్, మండల స్థాయి అధికారులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా అందరూ పనిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న పలువురికి క్లాస్ తీసుకున్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి గ్రామంలో స్వీప్ ద్వారా అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా చేయాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

ప్రలోభాలకు గురిస్తే కేసులు నమోదు చేస్తాం

ఓటర్లను మద్యం, డబ్బుతో ప్రలోభాలకు గురిచేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పాత బస్టాండులో గ్రామస్తులతో మాట్లాడారు. ఓటరు జాబితాలో పేరును సరిచూసుకోవాలని సూచించారు. ఓటు హక్కు విలువైందని.. ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని, వెంటనే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

పోలింగ్ స్టేషన్‌ల పరిశీలన

మండలంలోని 42 పోలింగ్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని తహసీల్దార్ జమానుల్లా ఖాన్‌ను ఆదేశించారు. మండలంలోని గని, గడివేముల పోలింగ్ స్టేషన్లతో పాటు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన పెసరవాయి, మంచాలకట్ట, చిందుకూరు, దుర్వేసి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. గడివేములలోని 306 పోలింగ్ కేంద్రంలో ఓటర్లు పోలింగ్ కేంద్రంలోకి వచ్చే ర్యాంపు గుంతలమయంగా ఉండడంతో సెక్టోరియల్ అధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో బాగు చేసి తనకు ఫొటోలు పెట్టాలని ఆదేశించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల సన్నద్ధతలో ఎక్కడా లోటుపాట్లు ఉండరాదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరామిరెడ్డి, ఎస్‌ఐ బీటీ వెంకటసుబ్బయ్య, సెక్టోరియల్ అధికారులు హేమసుందర్‌రెడ్డి, పవన్, భాస్కర్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన దుకాణాలు



కోడుమూరులో కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న మెయిన్‌బజార్

కోడుమూరు రూరల్: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కోడుమూరు పట్టణంలో సోమవారం జరిగిన పండుగ సంత కొనుగోలుదారులతో కిటకిటలాడింది. కూరగాయలు, కిరాణ, బట్టల దుకాణాలన్నీ జనంతో కిక్కిరిశాయి. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పండుగ సంత ఖరీదుగా మారిపోయింది. పెరిగిన ధరలతో చిన్న కుటుంబానికి కూడా పండుగ ఖర్చు రూ.10వేల నుంచి రూ.12వేలకు పైనే వస్తోంది.

టెంకాయలకు భలే గిరాకీ

ఉగాది సందర్భంగా దేవుళ్లకు, పెద్దలకు పూజలు నిర్వహిస్తారు. టెంకాయలను కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. ఈ నేపథ్యంలో టెంకాయలకు మార్కెట్లో భారీగా డిమాండ్ పెరిగింది.

నేడు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రమణ్యేశ్వరస్వామి

పాణ్యం: ఉగాదిని పురస్కరించుకుని కొత్తూరు సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ రామకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు పుణ్యాహవాచనం, అభిషేకాలు, అర్చనలు తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. సాయంత్రం వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామివారి ఉత్సవ మూర్తులకు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ఎడ్ల బండలాగుడు పోటీలు జరుగుతాయన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు

- కాటసాని శివ నరసింహారెడ్డి
- కరిమద్దెలలో ఎన్నికల ప్రచారం



కరిమద్దెలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న శివనరసింహారెడ్డి

గడివేముల: ఐదేళ్ల జగనన్న పాలనలో సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాలకు మేలు జరిగిందని.. ఇలానే కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తనయుడు కాటసాని శివ నరసింహారెడ్డి అన్నారు. సోమవారం గడివేముల మండలం కరిమద్దెల గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయని తెలిపారు. సంక్షేమ పథకాలను అర్హతే ప్రామాణికంగా దళారుల ప్రమేయం లేకుండా సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే అందించారన్నారు. విద్య, వ్యవసాయం, వైద్య రంగాల అభివృద్ధికి ఎనలేని కృషి చేసి లక్షలాది కుటుంబాలకు అండగా నిలిచారన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చేసి ఓర్వలేని ప్రతిపక్షాలు ప్రజలకు పథకాలు అందనీయకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నాయన్నారు. ఈసారి జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు పెత్తందార్లు.. పేదల మధ్య జరుగుతున్న యుద్ధమని అభివర్ణించారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ శివరామిరెడ్డి, సర్పంచ్ సుంకన్న, మాజీ సర్పంచ్‌లు డాలుస్వామి, భాస్కర్ రెడ్డి, మండల వ్యవసాయ సంఘం కమిటీ చైర్మన్ పుల్లయ్య, ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, దస్తగిరిరెడ్డి, ఆనంద్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు





సమావేశానికి హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు, మాట్లాడుతున్న ఎంపీడీఓ మల్లీశ్వరి.

- సర్వసభ్య సమావేశంలో ఎంపీడీఓ మల్లీశ్వరి
- గ్రామాల్లో నీటి సమస్యలను సభ దృష్టికి తెచ్చిన సభ్యులు

ఓర్వకల్లు: తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మల్లీశ్వరి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో సోమవారం ఎన్నికల నియమావళికి అనుగుణంగా మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా తాగునీటి సమస్యలపై సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. హుసేనాపురం గ్రామంలో నీటి ఎద్దడిని పరిష్కరించాలని సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు అధికారల దృష్టికి తెచ్చారు. సమస్యను అధిగమించడానికి రెండు ట్యాంకర్లను కేటాయించాలని కోరారు. అలాగే మీదివేముల గ్రామంలో లోఓల్టేజీ సమస్యతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని, రెండు బోర్లకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని మండల ఉపాధ్యక్షుడు పద్మనాభరెడ్డి విన్నవించారు. ఉయ్యాలవాడ గ్రామంలో మరో రెండు బోర్లు వేయించాలని సర్పంచ్ శకుంతలమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ కోరారు. అంతవరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. ఓర్వకల్లులోని ఎంపీపీ స్కూల్ వద్ద కొత్తబోరు వేయించామని, మోటర్ అమర్చాలని సర్పంచ్ నాగేశ్వరమ్మ కోరారు. అలాగే పెండేకంటి నగర్‌లో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంపీడీఓ పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. సరిపడా నిధులు లేకుంటే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు తీర్మానించిన పత్రాన్ని సమర్పిస్తే అవసరమైన నిధులను కేటాయిస్తామని పేర్కొన్నారు. హుసేనాపురం, కాల్వ గ్రామాల్లోని బోర్లల్లో నీరు ఉన్నా విద్యుత్ సమస్య వల్ల తాగునీటి కొరత ఏర్పడిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ ఆదేశించారు. గార్గేయపురం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు నుంచి గ్రామాలకు సరఫరా చేస్తున్న నీటిపై పరిమితి విధించడంపై పలువురు అభ్యంతరం తెలిపారు. ఎంపీపీ తిప్పన్న పాల్గొన్నారు.

వడదెబ్బకు ముందు జాగ్రత్తలే రక్ష

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్



ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కల్లూరు: రానున్న రోజుల్లో వడగాలుల తీవ్రత అధికమయ్యే సూచనలు ఉన్నట్లు వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో వడదెబ్బ తగలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం కల్లూరు మండలం కె.మార్కాపురం గ్రామంలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ సేవల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని తెలిపారు. ప్రజలందరూ వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ తగిలిన వెంటనే ఓఆర్ఎస్ కలిపిన నీళ్లీ తాగించి వైద్యులను సంప్రదించాలని సూచించారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, మధుమేహ రోగులు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వేసవిలో మాంసం, ఐస్‌క్రీమ్, శీతల పానీయాలు, మద్యపానానికి దూరంగా ఉండాలన్నారు. వడదెబ్బ తగలకుండా నీరు, పళ్ల రసాలు, మజ్జిగ, కొబ్బరి నీళ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఎండలో వెళ్లాల్సి వస్తే గొడుగు, టోపి ధరించాలని తెలిపారు. ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రజలకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నామన్నారు. కంటి ఆపరేషన్ చేయించుకున్న వారిని పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి మోతీలాల్ నాయక్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి

కర్నూలు (టౌన్): ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ అన్నారు. సోమవారం ఓటర్లకు అవగాహన కల్పించేందుకు నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మహావీర్ సర్కిల్, రాజ్‌విహార్, గౌరిగోపాల్, మెడికల్ కళాశాల, ప్రభుత్వ హాస్పిటల్ , గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంపు మీదుగా ద్విచక్ర వాహనాలు, చెత్త సేకరణ వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.

సర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్లపై సీరియస్

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కొందరు జనరల్ సర్జరీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకాలు చేయకపోవడంపై సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సీరియస్ అయ్యారు. సోమవారం జనరల్ సర్జరీ విభాగంలో సమీక్షించారు. ఆ విభాగం కనబరిచిన ప్రతిభ, వైద్యుల హాజరు గురించి ఆయన ఆరా తీశారు. ఇప్పటి వరకు జరిగిన మేజర్, మైనర్ ఆపరేషన్ల గురించి చర్చించారు. అవసరమైన పరికరాలు, వసతులు, మౌలిక సదుపాయాల గురించి వివరాలు కోరారు. సర్జరీ ప్రొఫెసర్లు హరిచరణ్, కోటిరెడ్డి, మాధవీ, రామకృష్ణనాయక్ పాల్గొన్నారు.

మతసామరస్యం పాటించండి



మాట్లాడుతున్న డీఎస్పీ విజయశేఖర్

కర్నూలు: హిందూ ముస్లిం అనే తారతమ్యం లేకుండా అందరూ మతసామరస్యాన్ని పాటించాలని కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ సూచించారు. రంజాన్, ఉగాది పండుగలు వరుసగా వచ్చిన నేపథ్యంలో సోమవారం పాతబస్తీలోని లక్ష్మీనరసింహా కల్యాణ మండపంలో ఒకటో పట్టణ సీఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా పాల్గొని ప్రసంగించారు. పాత బస్తీలోని హిందూ, ముస్లిం మత పెద్దలు సమావేశానికి హాజరయ్యారు. ఎవరైనా అశాంతిని రేకెత్తించేందుకు ప్రయత్నిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.